క్లుప్తంగా

కబ్జాదారుల నుంచి చెరువును కాపాడండి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగ మాధవి

నెల్లిమర్ల రూరల్: మండలంలోని తంగుడుబిల్లి కాలనీ దగ్గరున్న వివాదాస్పదమైన చెరువును ఎమ్మెల్యే లోకం నాగమాధవి సోమవారం పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడి చెరువుతో పాటు ఆయకట్టు వివరాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. ఎప్పటి నుంచో చెరువుగానే ఉందని, ఆ చెరువుకు కాలువలు కూడా ఉన్నాయని, సాగునీటి వనరుగా ఉపయోగపడుతోందని గ్రామస్తులు తెలిపారు. చెరువును కబ్జాదారుల నుంచి కాపాడాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఆమె సానుకూలంగా స్పందించారు. చెరువు పరిరక్షణ బాధ్యత తనదన్నారు.

ఏపీజీఈఏలో ఖాళీలకు ఎన్నికలు



కొత్తగా ఎన్నికైన వారితో సంఘ అధ్యక్షుడు వీరన్నదొర

నెల్లిమర్ల: ఏపీజీఈఏ(ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్) నెల్లిమర్ల తాలూకా యూనిట్‌లో వివిధ కారణాల రీత్యా ఏర్పడిన ఖాళీలకు సోమవారం ఎన్నికలు నిర్వహించారు. యూనిట్ అధ్యక్షుడు పాగి వీరన్నదొర ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరగ్గా పరిశీలకులుగా సంఘ జిల్లా అధ్యక్షుడు కంది వెంకటరమణ, జిల్లా సభ్యులు పి.మేరి, చీపురుపల్లి అధ్యక్షుడు పిన్నింటి హరిలు వ్యవహరించారు. జనరల్ సెక్రటరీగా నవీన్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రఘు, వైస్ ప్రెసిడెంట్లుగా గోవింద, త్రినాథరావు, జాయింట్ సెక్రటరీలుగా చంద్రశేఖర్, రఘు, రాజ్యలక్ష్మి, ఎడ్విన్ ఎన్నికయ్యారు.

తక్షణమే సమస్యలు పరిష్కరించాలి



వినతులు పరిశీలిస్తున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: తక్షణమే ప్రజాసమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చిన పలు వినతులను ఆయన పరిశీలించి, సంబంధిత అధికారులకు బదిలీ చేశారు. ప్రతి అధికారి తమ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, ఈఈ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


యూరియా వాడకం తగ్గించండి



అవగాహన కల్పిస్తున్న మండల ప్రత్యేకాధికారి శాంతి, తదితరులు

భోగాపురం: రైతులంతా పంటల సాగులో యూరియా వాడకం తగ్గించాలని మండల ప్రత్యేకాధికారి బి.శాంతి సూచించారు. మండల కేంద్రంలో యూరియా వాడకంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని, కాసేపు మాట్లాడారు. రైతులంతా యూరియాను ఎక్కువగా వాడడం వల్ల నేల నిస్సారమవుతోందన్నారు. ప్రతిరైతు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ పంటల సాగు చేపట్టాలన్నారు. అలా అయితే తక్కువ ఖర్చు కావడంతో పాటు సమయం కూడా ఆదా అవుతుందన్నారు. అధిక దిగుబడులు, ఆరోగ్యవంతమైన పంట చేతికి వస్తాయన్నారు. యూరియా, డీఏపీకి బదులు నానో యూరియా, నానో డీఏపీ వాడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో గాయత్రి, ఎంఏవో హైమావతి, ఏఈవో వెంకటరావు పాల్గొన్నారు.

నానో యూరియా వినియోగంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయ అధికారి

చీపురుపల్లి: నానో యూరియాతో ఎన్నో ప్రయోజనాలున్నాయని, వరి చేనుపై పిచికారీ చేయాలని ఏఓ సూర్యకుమారి సూచించారు. చీపురుపల్లి సచివాలయంలో వంగపల్లిపేట గ్రామానికి చెందిన రైతులకు నానో యూరియాపై సోమవారం అవగాహన కల్పించారు. నానో యూరియా నిల్వ, తరలింపు సులభమన్నారు.

లేఅవుట్ల క్రమబద్ధీకరణకు..

మరో అవకాశం

- అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు గడువు పెంపు
- అక్టోబరు 24లోగా దరఖాస్తులకు ఆహ్వానం
- అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారుల విజ్ఞప్తి



విజయనగరం శివారులోని ఓ లేఅవుట్

విజయనగరం: అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. గతంలో అమలు చేసి ఆ తర్వాత నిలిపివేసిన ఎల్ఆర్ఎస్(లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్)ను కూటమి ప్రభుత్వం పునరుద్ధరించింది. ఇటీవల విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం అక్టోబరు 24వ తేదీలోపు లేఅవుట్ల క్రమబద్ధీకరణకు యజమానులు ముందుకురావాలని కోరింది. ఈ పథకం ద్వారా తొలిదశలో విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ ఖజానాకు ఆదాయం రాగా తాజా ఆదేశాలతో మరికొంత ఆదాయం రుసుముల రూపంలో రానుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

తొలుత పెండింగ్ దరఖాస్తులు..

లేఅవుట్ల అనుమతుల విషయంలో చిక్కులు తొలగించడం ద్వారా పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామాల అభివృద్ధి జరుగుతుందంటూ ప్రభుత్వం పాత దరఖాస్తులను తిరగేస్తోంది. ఆయా ప్రాంతాల్లో తాగునీరు, మౌలిక సదుపాయాలు, రవాణా వంటి వసతులు మెరుగుపరిచే అవకాశం ఉంటుందని చెబుతోంది. ఈ నేపథ్యంలో ఆదాయాన్ని సమకూర్చుకోవడంలో భాగంగా పెండింగ్‌లోని దరఖాస్తులను ముందుగా పూర్తి చేయాలని నిర్ణయించింది. ఈ క్రమంలో గతంలోని పెండింగ్ దరఖాస్తులకు ప్రస్తుతం అవకాశం కల్పించారు. అప్పట్లో లేఅవుట్ల అనుమతుల కోసం 609 దరఖాస్తులు రాగా వాటిలో 471 పరిష్కరించడం జరిగింది. షార్ట్‌ఫాల్‌లో 138 వరకు పెండింగ్‌లో ఇంకా ఉన్నాయి. లేఅవుట్ ప్లానింగ్ లేకపోవడం, సౌకర్యాలు కల్పించకపోవడం, సంబంధిత ధ్రువీకరణ పత్రాలు సమర్పించకపోవడం వంటి కారణాలతో ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ప్రస్తుతం గ్రామాల అభివృద్ధి పేరిట నిబంధనలు సడలించినట్లు చెప్పుకొస్తున్నారు.

ఎస్ఆర్ఎస్ విధానంలో..

విజయనగరం మున్సిపల్ కార్పొరేషనన్ పరిధిలో గతంలో వివిధ కారణాలతో పెండింగ్‌లోని దరఖాస్తులను ఎస్ఆర్ఎస్ విధానంలో పూర్తి చేసేందుకు అవకాశం ఉందని కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు. ఎల్ఆర్ఎస్‌పై ఆయా వర్గాల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రత్యేక మేళాలు నిర్వహించి, లోపాలు సవరించే దిశగా సూచనలు ఇస్తున్నామని తెలిపారు. అన్ని పత్రాలు సమర్పించిన వారి దరఖాస్తులు పరిష్కరిస్తున్నామని చెప్పారు. ఈ అవకాశాన్ని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నామన్నారు.

ఖాళీ స్థలాలు కూడా..

ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసినానంతరం లైసెన్స్‌డ్ సర్వేయర్లు, ఇంజినీర్లు, స్ట్రక్చరల్ ఇంజినీర్లు, ఆర్కిటెక్‌తో ప్లాన్ తయారు చేయించుకుని సంబంధిత పత్రాలతో ముందుకు రావాలి. అపరాధ రుసుంలో 50 శాతం చెల్లించి, తనిఖీల అనంతరం మిగిలిన సొమ్ము కట్టాలి. మరో 14 శాతం నగదు అందిస్తే ఖాళీ స్థలాల(ఓపెన్ స్పేస్)ను సైతం క్రమబద్ధీకరించుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.

‘అన్నదాత పోరు’ను విజయవంతం చేయండి

- మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

పూసపాటిరేగ: ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై రైతన్నకు బాసటగా నిలుస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మంగళవారం విజయనగరంలో చేపడుతున్న అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కోరారు. ఇదే విషయమై ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్ని వర్గాల ప్రజలు కష్టాలను ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా రైతులను యూరియా కష్టాలు వీడడం లేదన్నారు. ప్రభుత్వ వైఫల్యం వల్లే రాష్ట్ర వ్యాప్తంగా యూరియా కొరత ఏర్పడిందని, దీంతో రైతులు ఎరువుల కోసం పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఈ నేపథ్యంలో అన్నదాత సంక్షేమం పట్టని కూటమి సర్కారును నిలదీస్తూ విజయనగరం ఆర్డీవో కార్యాలయం వద్ద జరిగే అన్నదాత పోరు కార్యక్రమానికి రైతులతో పాటు పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం, నెల్లిమర్ల మండలాల వైఎస్సార్ సీపీ నాయకులంతా హాజరుకావాలని కోరారు.

భోగాపురం: విజయనగరంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జరిగే అన్నదాత పోరుకు అందరూ తరలిరావాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి ఓ ప్రకటనలో సోమవారం కోరారు. మంగళవారం ఉదయం 9 గంటలకు అక్కివరం జంక్షన్ వద్దకు రావాలని, అక్కడి నుంచి ర్యాలీగా విజయనగరం వెళ్తామని తెలిపారు.

నెల్లిమర్ల రూరల్: జిల్లా కేంద్రంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జరిగే అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గదల సన్యాసినాయుడు ఓ ప్రకటనలో సోమవారం కోరారు. ఉదయం 9 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో అందరూ భాగస్వాములై రైతులకు బాసటగా నిలవాలన్నారు.

11, 12 తేదీల్లో కళా ఉత్సవ్ పోటీలు



వివరాలు వెల్లడిస్తున్న ప్రిన్సిపాల్ రామకృష్ణారావు

నెల్లిమర్ల: స్థానిక వేణుగోపాలపురం ప్రభుత్వ డైట్ కళాశాలలో ఈ నెల 11, 12వ తేదీల్లో భారతీయ సంస్కృతీ సంప్రదాయ వారసత్వ కళల పోటీలు(కళా ఉత్సవ్) నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.రామకృష్ణారావు సోమవారం తెలిపారు. ‘ఏక్ భారత్–శ్రేష్ఠ భారత్–2047లో భారతదేశం’ అనే అంశం థీమ్‌తో పోటీలు ఉంటాయన్నారు. ప్రభుత్వ గుర్తింపు కలిగిన విద్యాసంస్థల్లో 9, 10, 11, 12 తరగతులకు చెందిన ఆసక్తి ఉన్న విద్యార్థులంతా ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. కళా ఉత్సవ్ ఇన్‌చార్జ్ వాక చిన్నంనాయుడు మాట్లాడుతూ 11న గాత్ర సంగీతం వ్యక్తిగత–బృందం, వాయిద్య సంగీతం వ్యక్తిగత–బృందం, నృత్యం వ్యక్తిగత–బృందం విభాగాల్లో నిర్వహిస్తామని, 12న థియేటర్ ఆర్ట్స్, విజువల్ ఆర్ట్స్, సంప్రదాయ కథాకథనం విభాగాల్లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. పోటీల కోసం రిజిస్ట్రేషన్‌ను 10వ తేదీ సాయంత్రం 4 గంటల్లోగా ఫోన్ నంబర్ 9440912863ను సంప్రదించి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అప్పలనాయుడు, అధ్యాపకులు రమేష్, సూరిబాబు, తిరుపతిరావు, అప్పారావు, అన్నారావు, శ్రీనివాసరావు, శర్మ, సోమయాజులు, సూర్యకళ, రజిత, సౌమ్య, రామారావు తదితరులు పాల్గొన్నారు.

వర్క్‌షాప్ ప్రారంభం



ట్రైనర్‌ని సన్మానిస్తున్న కళాశాల డైరెక్టర్ శశిభూషణరావు

విజయనగరం అర్బన్: మండలంలోని సత్య డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో జీవన నైపుణ్యాలపై వర్క్‌షాపు సోమవారం ప్రారంభించారు. వారం రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, జీవన నైపుణ్యాలు, సమయ నిర్వహణ, కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి విషయాలను నేర్పించనున్నట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు తెలిపారు. సీతం ఇంజినీరింగ్ కళాశాలలో కూడా స్కిల్ అప్ వర్క్‌షాప్ ప్రారంభం కాగా, విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్ సహా ఈ–మెయిల్ రైటింగ్, ఫైనాన్స్ ఫర్ నాన్ ఫైనాన్స్, ఇంట్రడక్షన్ టు ఏఐ, ప్లానింగ్ అండ్ ప్రయారిటీ ఇంటర్వ్యూ స్కిల్స్, బిల్డింగ్ యువర్ ప్రొఫైల్, పీపుల్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ట్రైనర్ సత్యం చౌరాసియా తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందివ్వడం జరుగుతుందన్నారు. అనంతరం ట్రైనర్‌ని కళాశాల డైరెక్టర్ సత్కరించారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం



విజయనగరంలోని ఓ ప్రభుత్వ కార్యాలయం వద్ద వరదనీరు ఇలా..

కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. విజయనగరం కలెక్టరేట్ ప్రాంతంలో సోమవారం కురిసిన వర్షానికి కార్యాలయ ప్రాంతమంతా వరదనీటితో దర్శనమిచ్చింది. అలాగే వివిధ కార్యాలయాలకు వెళ్లే దారులు కూడా వర్షపునీటితో నిండిపోయాయి. దీంతో ఆయా కార్యాలయాలకు వెళ్లే వారంతా ఇబ్బందులు పడ్డారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

కేసు నమోదైతే భవిష్యత్ ప్రభావం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ గణేష్

నెల్లిమర్ల రూరల్: ఎవరిపైనా అయినా ఒక్కసారి పోలీస్ కేసు నమోదైతే వారి బంగారు భవిష్యత్‌పై తీవ్ర ప్రభావం పడుతుందని ఎస్ఐ గణేష్ హెచ్చరించారు. ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు మండలంలోని సతివాడ ఆదర్శ పాఠశాల విద్యార్థులకు ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై సోమవారం అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి చెడు అలవాట్లకు దూరంగా ఉండి, మంచి అలవాట్లు అలవర్చుకుని బాగా చదువుకోవాలన్నారు. శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు.

విజయనగరం క్రైమ్: ప్రతిఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఈగల్ టీమ్ అధికారి విజయ్‌కుమార్ సూచించారు. నగరంలోని మయూరి జంక్షన్‌లోని ఆర్‌కే డిగ్రీ కళాశాల విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై సోమవారం అవగాహన కల్పించారు. గంజాయి, ఖైనీ, మద్యం, సిగరెంట్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తెలిపారు.

గిరిజా ప్రసన్నకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



అవార్డు అందుకుంటున్న గిరిజా ప్రసన్న

విజయనగరం: నగరానికి చెందిన సముద్రాల గిరిజా ప్రసన్నకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరంలో పాన్ ఇండియా సోషియో కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపి, కాకినాడ జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.వి.వి.సత్యనారాయణల చేతులమీదుగా ఆమె ఈ అవార్డు అందుకున్నారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు, బంధువులు, శ్రేయోభిలాషులు, తోటి ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

పాలసీదారులకు ప్రయోజనం

చీపురుపల్లిరూరల్(గరివిడి): కేంద్ర ప్రభుత్వం ఇన్సూరెన్స్ పాలసీలపై జీఎస్టీని తొలగించడం వల్ల పాలసీదారులకు ఆర్థిక భారం తగ్గుతుందని ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ బోని వెంకటకుమార్ తెలిపారు. బ్రాంచ్ కార్యాలయంలో సోమవారం ఏఓఐ ఏజెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టీ రద్దుతో పాలసీదారులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు రామారావు, సిద్ధార్థ, వెంకటేష్, సత్యనారాయణ, ఎల్లంనాయుడు, ఎం.పి.నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

గంట్యాడ: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి ఏ.కృష్ణప్రసాద్ అన్నారు. మండలంలోని కొఠారుబిల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి కృష్ణప్రసాద్ మాట్లాడుతూ బాలికలు, మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని చెప్పారు. పలుచట్టాల గురించి వివరించారు. ఆపదలో ఉన్న మహిళలు రక్షణ, సంరక్షణ, వైద్య, న్యాయ సహాయం కోసం వన్‌స్టాప్ సెంటర్‌ను ఆశ్రయించాలని సూచించారు. హెల్ప్ లైన్ నెంబర్ 181కు ఫోన్ చేస్తే సహాయం అందుతుందని అన్నారు. బాల్య వివాహాలు నిరోధానికి, తప్పి పోయిన బాలలు, బాల కార్మికుల గురించి చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098కు సమాచారం అందించాలని సూచించారు. వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ పి.సాయి విజయలక్ష్మి, ఎస్ఐ సాయి కృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ జి.జగన్నాథరావు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ముస్లింల నిరసన



ఇమామ్, మౌజమ్‌లకు గౌరవవేతనం ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం వహిస్తున్న నిర్లక్ష్యాన్ని వ్యతిరేకిస్తూ విజయనగరం జిల్లా కలెక్టరేట్ ఎదుట ముస్లింలు సోమవారం నిరసనకు దిగారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ స్పోక్స్‌పర్సన్ ఎండీ నాజిర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలు సంక్షేమ పథకాలు అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత ప్రభుత్వంలో అర్చకులు, పాస్టర్లు, ఇమామ్‌లకు రూ.10 వేలు చొప్పున గౌరవవేతనం ఇచ్చేవారని గుర్తు చేశారు. ఇప్పుడు ముస్లింలకు ఎటువంటి వేతనాలు ఇవ్వడం లేదని, ఓటుబ్యాంక్‌గా మాత్రమే ముస్లింలను చూడడం తగదన్నారు. తక్షణమే గౌరవ వేతనాలు అందించే ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్యక్రమంలో కో–ఆప్షన్ మెంబర్లు మస్తాన్, రియాజ్ ఖాన్, మదీనా, బాషా, సయద్ రియాజ్, తెజ్డాన్ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

–విజయనగరం

మత్స్యకారుల ఆందోళన



జిల్లా సహకారం సంఘం పరిధిలోని కొన్ని ప్రాథమిక సహకార సంఘాల ఆధీనంలోని చెరువుల్లో అక్రమంగా జరుగుతున్న చేపల పట్టివేతకు వ్యతిరేకంగా మత్స్యకారులు, జిల్లా మత్స్యకార సహకార సంఘం నాయకులు సోమవారం ఆందోళనకు దిగారు. కలెక్టరేట్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు బర్రి చిన్నప్పన్న మాట్లాడుతూ చేపల చెరువులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వందలాది మత్స్యకార కుటుంబాలకు కొంతమంది అన్యాయం చేస్తున్నారని, దొంగతనంగా వాటిల్లోని చేపలు పట్టుకుని అమ్మేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే కొనసాగితే మత్స్యకారులు రోడ్డున పడాల్సిన దుస్థితి నెలకొంటుందని, తక్షణమే అక్రమంగా జరుగుతున్న చేపల పట్టివేతకు అడ్డుకట్ట వేయాలని కోరారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘ వైస్ ప్రెసిడెంట్ దాసరి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

–విజయనగరం అర్బన్

జాతీయ రహదారిలో అంధకారం



భోగాపురం మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై అంధకారం నెలకొంది. హైవే ఫ్లైఓవర్‌పై ఏర్పాటు చేసిన వీధి దీపాలేవీ కొన్నిరోజులుగా వెలగకపోవడంతో చీకటి అలుముకుంది. ఆ దారిలో వచ్చే వాహనాల లైట్ల వెలుగు తప్ప మరేమీ లేదు. దీంతో పాదచారులు, అటువైపుగా వెళ్తున్న వారు భయాందోళనకు గురవుతున్నారు. ఇదే విషయమై సీఐ కె.దుర్గాప్రసాద్‌ను స్థానికులు సంప్రదించగా, హైవే సిబ్బందితో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. –భోగాపురం

రైతుల ధర్నా



నకిలీ విత్తనాలు విక్రయించిన డీలర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రైతులు విజయనగరం కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. రైతుల తరఫున రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుద్ధరాజు రాంబాబు మాట్లాడుతూ రాజాం మండలంలోని గడిముడిదాం గ్రామ రైతులతో పాటు పారుగూరు రైతులు కలిసి నకిలీ విత్తనాల కారణంగా దాదాపు 350 ఎకరాల్లోని పంటను నష్టపోయారని తెలిపారు. వారందరికీ ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున పరిహారం ఇప్పించాలని కోరారు. అలాగే విత్తనాల కంపెనీ, డీలర్‌లపై కూడా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జి.వెంకటరమణ, సీహెచ్ గౌరినాయుడు, సీహెచ్ మాధవరావు, కె.తిరుపతిరావు, ఎస్.రాములు, సీహెచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

–విజయనగరం ఫోర్ట్

ప్రొఫెసర్లు వచ్చేశారు..

విజయనగరంఫోర్ట్: స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి కొత్త ప్రొఫెసర్లు వచ్చేశారు. ఇక్కడ నుంచి కొంతమంది అసోసియేట్ ప్రొఫెసర్లు..ప్రొఫెసర్లుగా పదోన్నతి పొంది వివిధ జిల్లాల్లోని ప్రభుత్వ వైద్య కళాశాలలు, ఆస్పత్రులకు బదిలీ కాగా వారి స్థానంలో రావాల్సిన ప్రొఫెసర్లు సోమవారం వచ్చి బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం ప్రభుత్వ వైద్య కళాశాల డెర్మటాలజీ విభాగం ప్రొఫెసర్‌గా ఉన్న డాక్టర్ కె.వెంకటాచలం, నంద్యాల ప్రభుత్వ వైద్య కళాశాల ఫోరెన్సిక్ విభాగం ప్రొఫెసర్‌గా ఉన్న డాక్టర్ ఆనంద్‌రావు, ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాల పిడియాట్రిక్ విభాగం ప్రొఫెసర్‌గా ఉన్న డాక్టర్ దీపక్‌కుమార్‌లు వచ్చినట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.